ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 24 జనవరి 2025



● దండాలు దండాలు అమ్మోరు తల్లి..

భీమవరం గునుపూడి గ్రామదేవత ఆదిలక్ష్మి, రాజ్య లక్ష్మి, పోలేరమ్మల జాతర గురువారం వైభవంగా జరిగింది. విభిన్న, విచిత్ర వేషధారణలతో కళాకారుల విన్యాసాలు అందరినీ అలరించాయి. 6లో..

మాధవాయిపాలెం రేవు పాట ప్రారంభ ధర రూ.3.13 కోట్లు

నరసాపురం రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవు పాట ప్రారంభ ధర రూ.3.13 కోట్లుగా జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోని అధ్యక్షతన సమావేశమైన కమిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పాట ప్రారంభధరపై చర్చించింది. మూడేళ్ల ఆదాయాన్ని సగటు కట్టి ప్రారంభధరను నిర్ణయించినట్లు ఎంపీడీవో రామకృష్ణంరాజు కమిటీకి తెలిపారు. దీనిని జిల్లా అధికారులకు నివేదించి, అనుమతి రాగానే నోటిఫికేషన్ ఇచ్చి మార్చిలో వేలం నిర్వహించాలని తీర్మానించారు. ఎంపీపీ మల్లికార్జున్, జెడ్పీటీసీ రాధకృష్ణ, ఈవోపీఆర్డీ నాగేంద్ర, సూపరింటెండెంట్ వీరభద్రరావు, సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ప్రశాంతం

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 23(ఆంధ్రజ్యోతి): పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో రెండో రోజు గురువారం జేఈఈ మెయిన్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 437 మంది హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 219 మందికి 217, సాయంత్రం 222 మందికి 220 మంది హాజరైనట్టు పరీక్షల కేంద్ర చీఫ్ కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్ తెలిపారు.



ఒకటి నుంచి క్యారీ బ్యాగ్స్ నిషేధం : కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): భీమవరంలో క్యారీ బ్యాగ్‌లు, డిస్పోజబుల్ టీ కప్పులను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిషేధించనున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ, డీపీవో, మెప్మా, మునిసిపల్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమై ప్లాస్టిక్ నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్లాస్టిక్ ఫ్రీగా పట్టణంగా భీమవరాన్ని తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. వినియోగంలో వున్న క్యారీ బ్యాగులు, డిస్పోజబుల్ టీ గ్లాసులను ఫిబ్రవరి మొదటి వారం నుంచి అనుమతించబోమని తేల్చి చెప్పారు. వీటికి ప్రత్యామ్నాయంగా 120 మైక్రాన్లలోపు క్యారీ బ్యాగులు లేదా గుడ్డ సంచులు, టీ వినియోగానికి గాజు గ్లాసులు, సిరామిక్ కప్పులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దశల వారీగా జిల్లా అంతటా ఆంక్షలు విధించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు.

● పచ్చని సోయగం కాదు.. కుళ్లిన కాల్వ !



● చిక్కి శల్యమైన.. కన్నీటి కాల్వ..!





గట్టును ఇలా ఆక్రమించి..

కాల్వలంటే.. అందరికీ చిన్నచూపే!

మొగల్తూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతమైన మొగల్తూరు ప్రధాన పంట కాల్వ దుర్వాసనతో కంపు కొడుతోంది. కాల్వలో పేరుకుపోయిన తూడును తొలగించకుండా అధికారులు రసాయనాలు చల్లడంతో అది కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. నిడదవోలు నుంచి ప్రవహించే ఈ కాల్వ మొగల్తూరు లాకుల వరకూ ప్రవహించి మిగులు నీరు ఉప్పుటేరులో కలుస్తుంది. ఈ నీటినే మొగల్తూరు, రామన్నపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లోని వరి సాగుకు, మంచినీటి ప్రాజెక్టులకు లిఫ్ట్ చేస్తారు. ఇరిగేషన్ అధికారులు కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాలు, తూడు పువ్వుల మొక్కలు, గుర్రపు డెక్కను ప్రొక్లెయినర్, లేదా కూలీలతో తొలగించకుండా రసాయనాలు స్ప్రే చేయడంతో అది కుళ్లి కిందకు దిగిపోతోంది. ఫలితంగా నీరు కలుషితంగా మారి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ నీరు పంట బోదెలు, చిన్న, చిన్న పంట కాలువల ద్వారా లిఫ్ట్ అయ్యే క్రమంలో వీటిని తాగుతున్న పశువులు, జలచరాలకు ప్రమాదం పొంచి వుంది. కేపీ పాలెం, మొగల్తూరు మంచినీటి ప్రాజెక్టు చెరువులకు ఈ నీటిని విడుదల చేస్తుండడంతో ఇక్కడ ప్రజలకు ఎటువంటి అనారోగ్యాలు సంభవిస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ మానవ, జంతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాలువ ఎగువ నుండి మంచి నీటిని అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంట కాల్వలంటే అందరికీ చిన్నచూపే..! పవిత్రమైన గోదావరి జలాలను తీసుకువస్తూ పాడి పంటలకు, ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాణాధారమైన కాల్వలంటే అందరికీ చిన్నచూపే. వీటిని చెత్త కుండీలుగా, గట్లను సొంత జాగీరుల్లా మార్చేశారు.

పెనుగొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పెనుగొండ నక్కల కాల్వ పరిస్థితి దయనీయంగా మారింది. ఎంతో విశాలంగా ఉండాల్సిన ఈ కాల్వ చిక్కి శల్యమైంది. పెరవలి మండలం కాకరపర్రు నుంచి యలమంచిలి మండలం లక్ష్మీపాలెం వరకు ప్రవహిస్తుంది. లక్ష ఎకరాలకు పైగా ఈ కాల్వ ద్వారా సాగు చేస్తున్నారు. కాల్వ వెడల్పు 30 అడుగులు ఉండాలి. కాని 15 అడుగులు కూడా లేకపోవడం విషాదం. కొంత పూడుకుపోవడంతోపాటు ఆక్రమణలకు గురైంది. ఎంత దారుణమంటే.. పంచాయతీ అధికారులు ఈ కాల్వ గట్లను డంపింగ్ యార్డుగా మార్చేశారు. పెనుగొండ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను సిబ్బంది ఈ కాలువ పక్కన పడేస్తున్నారు. ఇది కాల్వలోకి జారి ప్రవాహానికి అడ్డు పడడంతోపాటు, చెత్త కొట్టుకుపోయి పొలాల్లో మేట వేస్తోంది. వీటిని తొలగించుకోవడం రైతులకు అదనపు భారం. మరోవైపు మునమర్రు సమీపంలో ఒక వ్యక్తి ఈ కాల్వ సొంత జాగీరు అన్నట్టు గట్టును సగానికి పైగా పూడ్చేసి సాగు చేస్తున్నాడు. ఈ విషయం తెలిసి అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. కాల్వ నిర్వహణను విస్మరించడంతో పిచ్చిమొక్కలు పెరిగి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. భారీ వర్షాలు, వరదలు వస్తే పంటలు ముంపు బారిన పడటం ఖాయం. దీనిపై ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి ఏమంటారంటే.. సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కాల్వ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

67 రోజుల్లో అనుమతి రాకుంటే..

₹100 కోట్లు వెనక్కు!



లోసరి-భీమవరం-పిప్పర రహదారుల అభివృద్ధికి కేంద్ర రహదారుల నిధి(సీఆర్ఎఫ్) కింద రెండు నెలల క్రితం రూ.100 కోట్లు కేటాయించింది. కాని, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులు ఇవ్వలేదు. మార్చి నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి కాకుంటే నిధులు మురిగిపోయే ప్రమాదం వుంది. ఇంకా 67 రోజులు మాత్రమే మిగిలి వుంది. ఈలోగా పనులు ప్రారంభమైతేనే భీమవరం - తాడేపల్లిగూడెం రహదారికి మోక్షం లభిస్తుంది.

- భీమవరం-లోసరి-పిప్పర రహదారుల అభివృద్ధికి కేంద్రం సీఆర్ఎఫ్ నిధులు
- రెండు నెలల క్రితం మంజూరు.. రాష్ట్రం అనుమతిస్తేనే రోడ్ల నిర్మాణం
- వైసీపీ సర్కార్ పెట్టిన భారీ బకాయిలతో రాష్ట్ర ప్రభుత్వం సతమతం
- కొత్తగా అనుమతులు ఇచ్చేందుకు తటపటాయింపు.. అధికారులపై ఒత్తిడి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గతంలో భీమవరం నుంచి యండగండి వరకు రహదారిని అభివృద్ధి చేశారు. అక్కడి నుంచి యండగండి వరకు సింగిల్ రోడ్డు ఉంది. గోతులమయంతో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. భీమవరం పట్టణ పరిధి లోనూ రహదారులు దెబ్బ తిన్నాయి. కేంద్ర ప్రభుత్వం సీఆర్ఎఫ్ పథకంలో మంజూరు చేసిన రూ.100 కోట్లతో ఆశలు చిగురించాయి. రహదారుల అభివృద్ధి సాధ్యపడుతుందని అంతా ఆనందపడ్డారు. భవిష్యత్తులో లోసరి -భీమవరం-తాడేపల్లిగూడెం వరకు జాతీయ రహదారి అభివృద్ధి చెందాలంటే ప్రస్తుత రహదారిని విస్తరించాలి. అందుకు తగ్గట్టుగా కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యాయి. కాని రాష్ట్రస్థాయిలో పరిపాలన అనుమతులు మంజూరుచేయలేదు. ఈ జాప్యానికి పలు కారణాలున్నాయి. వైసీపీ హయాంలో సీఆర్ఎఫ్ నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేయలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా రూ.650 కోట్ల బకాయి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.150 కోట్లు చెల్లించారు. మరో రూ.500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ తరుణంలో సీఆర్ఎఫ్ నిధులకు మళ్లీ అనుమతులు ఇస్తే బకాయిలు పేరుకుపోతాయని ప్రభుత్వస్థాయిలో మల్లగుల్లాలు పడుతున్నారు.

రూ.100 కోట్ల పనులు ఇవే..

- భీమవరం నుంచి గొల్లవానితిప్ప మీదుగా బర్రివానిపేట వరకు వున్న డబుల్ రోడ్డును నాలుగు లేన్‌లుగా చేసేందుకు రూ.45 కోట్లు.
- భీమవరం బైపాస్‌తోపాటు - గొల్లల కోడేరు వరకు నాలుగు లేన్‌ల రహదారి అభివృద్ధికి రూ.31.5 కోట్లు.
- యండగండి-పిప్పర రహదారికి రూ.25 కోట్లు.. వెరసి కేంద్రం రూ.100 కోట్లు మంజూరుచేసింది.

వీటికి మార్చిలోగానే అనుమతులు ఇవ్వాలి. లేదంటే నిధులు మురిగిపోయే ప్రమాదం ఉంది. ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వం తర్జన భర్జన పడుతోంది. కేంద్రం ఇచ్చే సీఆర్ఎఫ్ నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూరుస్తుంది. మిగిలిన 90 శాతం కేంద్రమే చెల్లిస్తుంది. వైసీపీ హయాంలో మంజూరుచేసిన నిధులకు పనులు పూర్తిచేశారు. నిధులు దారి మళ్లించారు. దీంతో బకాయిలు

మిగతా 8వ పేజీలో..



అక్రమంగా బొండు మట్టి తవ్వకాలు

ఆచంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం అయోధ్యలంక భూముల్లో కొన్ని రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా బొండు మట్టిని అక్రమంగా తవ్వుతున్నారు. ఈ లంక గ్రామాలు ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతాలు కావడంతో కొన్నేళ్లుగా అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు సరిహద్దులను పూర్తిస్థాయిలో తేల్చకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. అధికారులు ఎవరూ రారనే ధీమానే ఇందుకు కారణం. అయోధ్యలంకలో ఇటీవల పగలు బొండు మట్టిని అక్రమంగా తవ్వడంతోపాటు రాత్రి వేళల్లో ఇసుకను తరలించి పెద్ద ఎత్తున సొమ్ములు చేసుకున్నారు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. తహసీల్దార్ జి.కనకరాజు బుధవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం బేస్‌మెంటు నిమిత్తం ఐదు యూనిట్లు మట్టి తీసిన బొర్రే రామచంద్రమూర్తి, బద్దే ప్రకాష్‌పై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.



● డిసెంబరు నాటికి డయా ఫ్రం వాల్ నిర్మాణం

ఈ ఏడాది డిసెంబరు నాటికి పోలవరం డయా ఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. గురువారం ఆయన పోలవరం ప్రాజెక్టును సందర్శించి పనుల తీరుపై సమీక్షించారు. వార్త మెయిన్‌లో..




● వేడుకగా మంత్రి లోకేశ్ జన్మదిన సంబరాలు

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పుట్టిన రోజు కేక్‌ను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కట్ చేసి(చిత్రంలో) వేడుక చేసుకున్నారు. వివరాలు 8లో

హైస్పీడ్ బోటు.. ఉపాధికి వేటు !

తీరానికి కాకినాడ నుంచి వేటకు వస్తున్న స్పీడ్ బోట్లు
లోతుల్లోకి వెళ్లి సంపద వేట



సముద్రంలో చిన్నబోట్లకు చిక్కని మత్స్య సంపద.. మత్స్యకారుల ఆందోళన

నరసాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి):గోదావరి సముద్రంలో కలిసే ప్రదేశం కావడంతో నరసాపురం తీరంలో అపార మత్స్య సంపద చిక్కుతుంది. ఈ కారణంగా ఇక్కడ వేటాడేందుకు కాకినాడ, నెల్లూరు, ప్రకాశం, మచిలీపట్నం ప్రాంతాల నుంచి ఈ సీజన్‌లో ఇంజన్ బోట్లు వస్తుంటాయి. చిన్నబోట్లతో కలిసి 700 నుంచి 800 బోట్లు అంతర్వేది లైట్‌హౌస్ పరిధిలో వేట సాగిస్తాయి. వందలాది మంది మత్స్యకారులకు ఉపాధికి ఇప్పటి వరకు కేరాఫ్‌గా నిలిచింది. అయితే ఈ సంపదను సులువుగా క్యాష్ చేసుకునేందుకు కొంత మంది హైస్పీడ్ బోట్లను రంగంలోకి దించారు. కాకినాడ నుంచి కొంత కాలంగా 40 బోట్ల వరకు వేట సాగించి సముద్రం లోతుల్లో వున్న మత్స్య సంపదను సైతం వలేసి పట్టేస్తున్నాయి. ఈ కారణంగా ఇప్పటి వరకు వేట సాగిస్తున్న చిన్న ఇంజన్ సోనా బోట్లకు సంపద చిక్కని పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా వేట సాగిస్తున్నా కనీసం ఖర్చులు కూడా రావడం లేదు. దీంతో మత్స్యకారులకు ఉపాధి ప్రశార్థకంగా మారింది. ఈ బోట్లను నియంత్రిస్తే గాని తమకు ఉపాధి ఉండదన్న



వాదనను తెరమీదకు తీసుకొచ్చారు. నరసాపురం, అంతర్వేది సముద్ర తీరంలో ఎనిమిది నుంచి పది కిలోమీటర్ల లోపలికి వెళ్లి మత్స్యకారులు వేట సాగిస్తుంటారు. దశాబ్దాలుగా సోనా బోట్లపైనే ఎనిమిది, పది మంది మత్స్యకారులు వేటాడటం అనవాయితీ. ఈ బోట్స్ ఇంజన్ సామర్థ్యం తక్కువ. కావున కొద్దిదూరం లోతుకెళ్లిన వలను మాత్రమే పైకి లాగగలదు. ఈ కారణంగా నీటిపై తేలియాడే సంపద మాత్రమే వలలో పడేది. కొన్ని సమయాల్లో భారీ చేపలు పడితే ఇంజన్‌తో బయటకు తీయడం కష్టం. ఇలాంటి సమయాల్లో మత్స్యకారులు విలువైన వలలను నష్టపోయేవారు. ఒక బోటు వేటకు వెళితే

మిగతా 8వ పేజీలో..

- ఇటీవల కాకినాడ ప్రాంతానికి చెందిన కొందరు మత్స్యకారులు కేరళ నుంచి హైస్పీడ్ ఇంజన్ బోట్లను రప్పించారు. ఓల్వో బస్సుకు ఉండే తరహాలనే వీటికి హైస్పీడ్ ఇంజన్లు ఉండటం దీని ప్రత్యేకత.
- పెద్ద వలలు ఉండడంతో ఒకసారి విసిరితే సముద్ర అడుగుభాగం వరకు వెళ్లి మత్స్యసంపదను పట్టేస్తుంది. వీటిని హైస్పీడ్ ఇంజన్ సులభంగా లాగేస్తుంది. దీనివల్ల సముద్రం అడుగు భాగంలో ఉన్న మత్స్య సంపదను పూర్తిగా లాగేయడం వల్ల మిగిలిన వారికి ఏమీ దొరక్క ఖాళీగా రావాల్సి వస్తోంది.
- గతంలో ఇలాంటి బోట్లు విశాఖ నుంచి తీరానికి వచ్చాయి. అప్పట్లో ఈ ప్రాంతవాసులు అభ్యంతరం చెప్పడంతో ఆగిపోయాయి. మళ్లీ ఇప్పుడు కాకినాడ నుంచి ఈ బోట్లు వస్తుండటంతో సంపద చిక్కక వేటకు వెళ్లిన బోట్లు ఖాళీగా రావాల్సి వస్తోంది.

సురభి ఒక కుటుంబం

127 ఏళ్లుగా నాటక రంగానికి సేవలందిస్తున్న సంస్థ

అదరగొట్టే సెట్టింగ్‌లు, ఆకట్టుకునే కళాకారులు..

నాట్యమండలి డైరెక్టర్,నటుడు వేణుగోపాలరావుతో చిట్‌చాట్





రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న వేణుగోపాలరావు

ఉండి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నూట ఇరవై ఏడు సంవత్సరాలుగా సురభి నాటక సంస్థ కళా రంగానికి ఊపిరి పోస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన 40 మంది కళాకారులు తమ బతుకుతెరువు కోసం నాటకాలు వేసి ఇంతకాలం తెలుగు నాటకాన్ని బతికిస్తూ వస్తున్నారు. కళ్లకు కట్టినట్టుగా కళను ప్రదర్శించడమే సురభి నాటకాల ప్రత్యేకత. స్త్రీ, పురుష పాత్రలతో పాటు పిల్లలు కూడా నాటకాల్లో పాత్రలు వేస్తుంటారు. ఒక పక్క స్కూళ్లకు, కళాశాలకు వెళ్లి చదువుకుంటూ రాత్రులు నాటకాలలో నటిస్తూ ప్రేక్షకుల మన్ననలను అందుకుంటున్నారు. వినాయక నాట్యమండలి (సురభి) ప్రధాన కళాకారుడు, డైరెక్టర్ ఆర్.వేణుగోపాలరావును ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు చెప్పారు.. అయన మాటల్లోనే..

• సురభి సంస్థను ఎప్పుడు ప్రారంభించారు ?

1885సంవత్సరంలో కడప జిల్లాలో రాయచోటిలో సురభి సంస్థను ప్రారంభించారు. 1925లో పశ్చిమగోదావరి జిల్లా ఉండి-భీమవరంలలో ప్రత్తిపాటి నాగభూషణ శర్మ చేతుల మీదుగా శ్రీవినాయక నాట్యమండలి (సురభి) నేషనల్ థియేటర్‌ని స్థాపించాం.

• స్థాపించింది ఎవరు ?

వనరాస గోవిందరావు శ్రీకారం చుట్టారు. కీచకవధ నాటకం తొలి ప్రదర్శన. గతంలో 50 వరకు సంస్థలు వుండేవి. ప్రస్తుతం ఉన్నది మా సంస్థ ఒక్కటే. శ్రీవినాయక నాట్యమండలి మాత్రమే మిగిలి వుంది.

• ప్రస్తుతం ఎన్నోతరం నడుస్తోంది ?

ఎనిమిదో తరం నడుస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన 40 మంది సభ్యులు సురభి నాటకాలలో నటిస్తుంటారు. మూడేళ్ల పాప నుంచి 79 ఏళ్ల వృద్ధుల వరకు పాత్రలను పోషించి శభాష్ అనిపించుకుంటారు. ప్రస్తుతం 18 మంది స్త్రీలు, 25 మంది పురుషులు, ఏడుగుగురు పిల్లలు సంస్థలో ఉన్నారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో స్థిరపడ్డాం.. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రదర్శనలకు వెళుతుంటాం..

• ప్రత్యేక గుర్తింపు ఏమైనా లభించిందా?

మా నాటక ప్రదర్శనలకు గిన్నిస్ వరల్డ్ రికార్డు లభించింది. ముఖ్యంగా నాటకానికి అనుగుణంగా సెట్టింగ్‌లు వేయడం సురభి సంస్థ ప్రత్యేకత.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాస్త ప్రోత్సాహం అందిస్తున్నది. సినిమా, టీవీ, సెల్‌ఫోన్స్ వచ్చాక నాటకాలపై ఆసక్తి అంతగా ఉండడం లేదు. నాటక రంగ కళాకారులకు చాలా ఇబ్బందికరంగా మారింది.

• ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది ?

సురభి నాటకాలు చాలా బావుంటాయని ప్రజలు కితాబిస్తారు. గ్రామాల్లో ఇప్పటికీ ఆదరణ బావుంటుంది. నాటకాలను ఆసక్తిగా తిలకిస్తారు.. సెట్టింగ్‌లు, సన్నివేశాలను చూసిన వారు చప్పట్లతో ప్రోత్సాహం ఇస్తున్నారు.

• మీరు పొందిన పురస్కారాలు ?

జాతీయస్థాయిలో ఢిల్లీలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందుకున్నా. ఆంధ్ర-తెలంగాణ ముఖ్య మంత్రులు, గవర్నర్లు చేతుల మీదుగా పలు పురస్కారాలు తీసుకున్నాను.

• ప్రభుత్వ ప్రోత్సాహం ఎలా ఉంది ?

ఆంధ్ర-తెలంగాణ ప్రభుత్వాలను ఎప్పటి నుంచో స్థలం అడుగుతున్నాం. రెండు ప్రభుత్వాలు ముందుకు వచ్చి సురభి నాటకాలను ప్రోత్సహించడానికి తమకు అండగా నిలవాలని ఆశిస్తున్నాం. అమరావతిలోనైనా స్థలం కేటాయిస్తే ఆ ప్రాంతంలో నాటకరంగ అభివృద్ధికి అవకాశం వుంటుంది.



మంత్రముగ్ధులను చేసిన శ్రీనివాస కల్యాణం

కోలమూరులో ముగిసిన సురభి నాటకాలు

ఉండి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కళాభిమానులను శ్రీనివాసకల్యాణం నాటకం మంత్రముగ్ధులను చేసింది. మూడు రోజులుగా ఉండి మండలం కోలమూరులో సంతాన గోపాలస్వామి ఆలయంలో ముక్కోటి, ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సురభి నాటక పౌరాణిక నాటక ప్రదర్శనలు గురువారం రాత్రితో ముగిశాయి. కలియుగంలో శ్రీమహా విష్ణువు శ్రీనివాసుడుగా అవతారమెత్తి పద్మావతిని పరిణయం ఆడతాడు.. ఈ నాట కంలోని పలు ఘట్టాలలో కళాకారుల ప్రద ర్శనకు మైమరచి చూశారు. చలిలో కూడా కదలకుండా తిలకించారు. గురువారం ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ సురభి కళాకా రులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కళలకు జీవం పోస్తున్న కళాకారులను అభినందించారు. చిన్నపుడు నాటకాలు ఎక్కడ ప్రదర్శించినా చూసేవారమన్నారు. కళాకారులకు అండగా వుంటామన్నారు.





పూర్వ విద్యార్థులతో పాఠశాల సిబ్బంది... పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వల్లూరు స్కూలుకు లక్షా 7 వేలతో ఏర్పాటు చేసిన ఫిజిక్స్ , జువాలజీ, బోటని ల్యాబ్

రూ.లక్షతో వల్లూరు స్కూల్‌కు ల్యాబ్

ఆచంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో లక్షా 7 వేల రూపాయలతో వల్లూరు జిల్లా పరిషత్ మహిళా జూనియర్ కళాశాలలో ల్యాబ్ ఏర్పాటు చేశారు. 1979-80 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం కళాశాలను సందర్శించారు. వారి సహకారంతో ఫిజిక్స్, జువాలజీ, ల్యాబ్ ఏర్పాటు చేశారు. బోటని ల్యాబ్ నిమిత్తం ముత్యాల చిట్టిబాబు రూ. 45 వేలు, ఫిజిక్స్ ల్యాబ్, ఫర్నీచర్ కోసం చావలి సీతారామారావు రూ. 25 వేలు విరాళాలను ఇచ్చి కళాశాల అభివృద్ధికి సహకరించారని పాఠశాల హెచ్‌ఎం ఎస్. నరసింహం అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను, దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి బేబి, ఎస్‌ఎంసీ చైర్మన్ జాన్స్ కుమార్, అభివృద్ధి కమిటీ సభ్యుడు నేలపూడి రామ్మోహనరావు పాల్గొనగా దాతలను జడ్పీటీసీ సురేష్ బాబు అభినందించారు.

పోలవరంలో మహారాష్ట్ర గన్‌లు

జోరుగా ప్లాస్టిక్ తుపాకీల అమ్మకాలు

కోతులు, పక్షుల బెడద తప్పించుకునేందుకు ఎగబడి కొన్న రైతులు, గ్రామస్థులు



ప్లాస్టిక్ గన్‌లు అమ్ముతున్న మహారాష్ట్ర వ్యాపారులు

పోలవరం జనవరి 23(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో గురువారం ప్లాస్టిక్ తుపాకీల అమ్మకాలు గ్రామస్థులలో కలకలం రేపాయి. ఏటిగట్టు సెంటర్‌లో భారీ తుపాకీ పేలుడు శబ్దాలు వినిపించడంతో తొలుత కంగారు పడ్డారు. తర్వాత విషయం తెలుసుకుని తుపాకీల కొనుగోలుకి ఎగబడ్డారు. పోలవరం మండలంలో కోతుల బెడదతో నివాసాలలో ఉండేవారు, పక్షుల బెడదతో వ్యవసాయదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకి చెందిన వ్యాపారులు గ్యాస్ వెల్డింగ్‌కి వినియోగించే కార్బన్ పదార్థంతో పేలి భారీ శబ్దం చేసే ప్లాస్టిక్ గన్‌లను అమ్మకాలు చేశారు. దీంతో కోతులు, పిట్టల బెడద నివారించడానికి గ్రామస్థులు, రైతులు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ తుపాకీలు కొనుగోలు చేశారు. ఒక్కో తుపాకీ 250 రూపాయలకు అమ్మారు.

ఢిల్లీ పిలిచింది



రిపబ్లిక్ డే వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం



ఎర్రకోటకు పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం

ఉమ్మడి పశ్చిమలో ఘనత సాధించిన ఏకైక గ్రామం

కేంద్ర ప్రభుత్వం అందించిన పథకాలు క్షేత్ర స్థాయిలో వందశాతం పేదలకు చేరవేయడంలో సఫలీకృతమైన గ్రామాలకు లభించే అరుదైన అవకాశం పెదతాడేపల్లి గ్రామానికి దక్కింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏకైక గ్రామ పంచాయతీగా నిలిచిన పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం ఈనెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు సతీ సమేతంగా రావాలంటూ ఆహ్వానం అందుకున్నారు. 6,581 మంది జనాభా ఉండే ఈ పంచాయతీలో 14 వార్డుల్లో 1,909 కుటుంబాలు, ఇద్దరు ఎంపీటీసీలు, 112 డ్వాక్రా సంఘాలున్నాయి. వీటిని సమన్వయం చేస్తూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి మాతృవందన, కిసాన్ క్రెడిట్ కార్డ్స్ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వంటి పథకాలు నూరు శాతం అమలు చేయడంలో కీలకంగా వ్యవహరించడంతో ఆయనకు ఈ అవకాశం లభించింది.

ఎంతో ఆనందంగా ఉంది..



ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడం మంచి అవకాశం. గ్రామ పంచాయతీలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఎంతో కృషి చేస్తున్నారు. వారి కృషికి తగ్గట్టుగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడం మా బాధ్యత. ఈ గౌరవం మా ప్రాంత సర్పంచ్ లందరికీ దక్కినట్టు భావిస్తాను. గ్రామాభివృద్ధికి మరింత కట్టుబడి పనిచేస్తాను.

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

98 వేల మంది పోటీ.. ప్రత్తిపాడు విద్యార్థినికి అవకాశం

విద్యార్థి దశ నుంచే సత్తా చాటి తమకు తామే సాటి అని చెప్పుకుంటున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. ఆ కోవలోకే వస్తుంది పెంటపాడు మండలం ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయలో 8వ తరగతి చదువుతున్న జవ్వాది రాహిణి. .కేంద్రప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఆజాదీ అమృత్ మహోత్సవ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైంది. రాష్ట్రం నుంచి ఇద్దరు అర్హత సాధించగా వీరిలో రాహిణి ఒకరు. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరులపై అవగాహన కల్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వీర్‌గాధ్ 4.0 కార్యక్రమాన్ని నిర్వహించింది. రాష్ట్రం నుంచి మొత్తం 98 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేయించుకున్నారు. రాహిణి మరాఠా యోధుడు నానా సాహెబ్ జీవిత చరిత్రపై పద్యం రాసి అందరి మన్ననలను అందుకుంది. టీచర్ బడేటి లక్ష్మి ఆమెకు తోడ్పాటు అందించారు. రూ.10 వేలు పారితోషికంతో పాటు ఈనెల 26వ తేదీన ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలలో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. చిన్ననాటినుంచే రాహిణి దేశనాయకుల చరిత్ర తెలుసుకునేందుకు ఆసక్తి కనపర్చేదని తండ్రి సత్యసారధి తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలన్నా రాహిణీకి చాలా ఇష్టమని అలాగే బాస్కెట్‌బాల్, కూచిపూడిలో శిక్షణ తీసుకుంటోందన్నారు



సైంటిస్టు అవ్వాలన్నది నా లక్ష్యం : రాహిణి

నేను పుట్టిన దేశానికి ఉపయోగపడాలి. అందుకే నేను సైంటిస్టు అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. దీనికి సంబంధించి ఇప్పటికే తెసులుకునే ప్రయత్నం చేస్తున్నాను. కష్టపడి చదువుతున్నాను.నాకు ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే నాకు చదువు చెప్పే ఉపాధ్యాయులు, పేరెంట్స్‌ని అడిగి తెలుసుకుంటాను.

ఏపీ శకటం ముందు నృత్యం..



కసిరెడ్డి దివ్య

పెంటపాడు గ్రామానికి చెందిన కసిరెడ్డి దివ్యకు అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు సంబంధించి ఏటి కొప్పాక బొమ్మల ఏపీ శకటాన్ని ప్రదర్శించనున్నారు. ఈ శకటం ముందు నృత్యం చేసే అవకాశాన్ని అంబాజీపేట మండలం ముక్కాములకు చెందిన పసుపులేటి నాగబాబు బృందానికి లభించింది. ఈ బృందంలో రాష్ట్రం నుంచి మొత్తం 16 మంది కళాకారులు ఉండగా వీరిలో దివ్య కూడా ఒకరు. పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న దివ్య ప్రస్తుతం పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. తల్లిదండ్రులు విజయబాస్కర్, పూర్ణిమ. పోస్టుబేసిక్ పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు, వైస్ చైర్మన్ వరలక్ష్మి, హెచ్‌ఎం రాజేష్ తదితరులు దివ్యను అభినందించారు..

పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

కొనేవారే కరువు



పతనం అవుతున్న మిర్చి ధర

క్వింటా రూ.10 నుంచి 12 వేలు

కుక్కునూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మిర్చిసాగు చేస్తున్న రైతులకు కన్నీటి వెతలు తప్పటం లేదు. వరుసగా మూడో ఏడాది కూడా పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరానికి రూ.50 వేల నుంచి లక్ష వరకు నష్టపోయే పరిస్థితులు ప్రస్తుతం ఏర్పడ్డాయి. ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఘనణీయంగా తగ్గిన మిర్చిసాగు రాబోయే రోజుల్లో సాగు చేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ళుగా తెగుళ్ల కారణంగా మిర్చి దిగుబడి తగ్గడంతో రైతాంగం నష్టపోయారు. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికి ఆశించిన స్థాయిలో ధరలేక రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం క్వింటా మిర్చి రూ.10 వేల నుంచి 12 వేలు పలుకుతుంది. అయినప్పటికి రైతులు కళ్లాల దగ్గరకు వచ్చి కొనుగోలు చేయడానికి మాత్రం వ్యాపారులు రావడం లేదు. దీంతో రైతులు కళ్లాల్లోనే మిర్చి నిల్వ చేస్తున్నారు. క్వింటా మిర్చిని కొయ్యడానికి రైతులకు రూ.5 నుంచి 6 వేలు ఖర్చవుతుంది. ప్రస్తుతం ఉన్న ధర చూస్తే రూ. 10 నుంచి 12 వేలు ఉంది. సగం డబ్బులు మిర్చి కొయ్యడానికే ఖర్చవుతుండగా కౌలు ధరలు, పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలతో పెట్టుబడి పెరిగింది. ఇవన్నీ లెక్కగడితే రైతులు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో రైతాంగానికి వ్యాపారులెవరూ పెట్టుబడులు పెట్టడం లేదు. దీంతో రైతులు బయట అప్పులు తెచ్చి మిర్చి సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు వేల ఎకరాల్లో మిర్చి పంటను పండించారు. ఈ ఏడాది కేవలం ఆరు వేల ఎకరాల్లో మాత్రమే సాగవుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఇక ముందు మిర్చి పంట కనుమరుగవు తుందని రైతులు చెబుతున్నారు. గతేడాది వందలాది మంది రైతులు ధర పెరుగుతుందని ఆశాభావంతో గుంటూరు ఏసీ గొడౌన్స్‌లో మిర్చి నిల్వ చేశారు. అయినప్పటికి ధరలు పెరగకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

మూడేళ్లుగా కష్టాలే..



మూడేళ్ళుగా మిర్చి సాగుతో కష్టాలు, అప్పులే మిగిలాయి. ఆశించిన దిగుబడి రావడంలేదు. ధర ఉండటంలేదు. దీంతో మిర్చి రైతాంగానికి అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

- అంగిరేకులు సూరిబాబు, రైతు, కుక్కునూరు,

వైభవంగా ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ జాతర







జాతరలో వివిధ వేషధారణలు.. తిలకిస్తున్న ప్రజలు

భీమవరం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్లకు గురువారం వైభవంగా జాతర నిర్వహించారు. రజక యూత్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటల నుంచి జాతర ప్రారంభమైంది. శక్తి వేషాలు, కోయ డ్యాన్స్‌లు, అఘోరాలు, ఆసాదుల నృత్యాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు సాగింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో అమ్మవార్లకు ఊయ్యాల సేవ నిర్వహించారు. గునుపూడి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.మహిళలకు అమ్మవారి కుంకుమ పంపిణీ చేశారు.

రేపు కైకలూరులో కొల్లేరుపై సమావేశం

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరులో ఆక్రమణల చెరువుల ధ్వంసంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈనెల 25న మూడు గంటలకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొల్లేరు నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు కొల్లేరు సంఘం నాయకుడు సైదు సత్యనారాయణ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 9 మండలాలు, రెండు పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. తాజా సుప్రీంతీర్పుతో మరింత ఆందోళన చెందుతున్నార్నారు. 25న జరిగే సమా వేశానికి ఏలూరు ఎంపీ పుట్టామహేష్‌కుమార్ యాదవ్, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, కొల్లేరు ప్రాంత ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని తెలిపారు.



అశ్వ వాహనంపై లలితా త్రిపురసుందరి గ్రామోత్సవం

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చల్లనితల్లి.. సర్వదాకాపాడు అంటూ భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రులో ఉన్న శ్రీలలితా త్రిపురసుందరీదేవి ఆలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై అమ్మవారిని ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రేపాక దుర్గాప్రసాద్, కార్యదర్శి చెన్నా ప్రవీణ్‌కుమార్, శివరామ్‌ప్రసాద్, ఎం.నాగరాజు పర్యవేక్షించారు.



చిత్రలేఖనం, డ్యాన్స్ పోటీల్లో బంగారు పతకాలు

పెదపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన చిత్రలేఖనం, డాన్స్ పోటీల్లో అప్పనవీడు హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లుగా హెచ్.ఎం. పుష్పవతి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో గురువారం ప్రత్యేకంగా అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాహిత్యం, సాంస్కృతిక, కళా రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. కళల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో మెరుగైన అవకాశాలుంటాయని చిత్రలేఖనం ఉపాధ్యాయుడు రజనీకాంత్ తెలిపారు. ఉపాధ్యాయులు అమరావతి, సారధి, బాబి, జయలక్ష్మి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన అపుస్మా క్రీడాపోటీలు

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఏలూరు జోన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరుగుతున్న గేమ్స్, స్పోర్ట్స్‌మీట్ గురువారం ముగిశాయి. జోన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అపుస్మా రాష్ట్ర జనరల్ కార్యదర్శి ఎం.బి.ఎస్ శర్మ, రీజనల్ అధ్యక్షుడు జి.బుల్లబ్బాయ్ తదితరులు హాజరయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ఈనెల 29న జరిగే వేడుకల్లో బహుమతులు అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏలూరుజోన్ పీఎస్టీలు కె.వి.ఆర్ సతీష్, కె.శేఖర్, కడియాల విజయలక్ష్మి, కె.చంద్రశేఖర్‌రావు, ఎస్.ఆర్.కె ప్రసాద్, కె.వినోద్, శివకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

26న బాస్కెట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈనెల 28 నుంచి 31వ తేదీవరకు అంతర్‌జిల్లాల అండర్ -23 పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఈనెల 26వ తేదీన ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికల హైస్కూల్లో మహిళాజట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు జనవరి 1వ తేదీ 2002 సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.వివరాలకు 94411 71933 నెంబర్లలో సంప్రదించాలని కార్యదర్శి గవ్వా శ్రీను,ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు.

ఒబిలిశెట్టి గోపాలకృష్ణమూర్తికి జైవిక్ ఇండియా అవార్డు

ద్వారకాతిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్న ద్వారకాతిరుమల మండలంలోని గుండుగొలనుకుంటకు చెందిన ఒబిలిశెట్టి గోపాల కృష్ణమూర్తికి జైవిక్ ఇండియా అవార్డు-2025 లభించింది. ఈ అవార్డును ఆయన బెంగళూరులో అంతర్జాతీయ యోగ్యతా కేంద్ర ప్రతినిధుల నుంచి బుధవారం సాయంత్రం అందుకున్నారు. గుండుగొలనుకుంటలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరుల శిక్షణా కేంద్రంలో ఆయన కషాయాలు వంటివి తయారు చేస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులు ఆయనను అభినందించారు.



బెంగళూరులో ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న గోపాలకృష్ణమూర్తి



లోకేశ్ ఫేస్ మాస్క్‌లతో విద్యార్థినుల శుభాకాంక్షలు

ద్వారకాతిరుమల గురుకుల పాఠశాల విద్యార్థినులు మంత్రి నారా లోకేశ్ ఫేస్ మాస్క్‌లను ధరించి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. దాదాపు 700 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్క్‌లు ధరించిన విద్యార్థినులతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సెల్ఫీ దిగారు.

- ద్వారకాతిరుమల

నిధులు బొక్కేసినా.. చర్యలేవీ!

- చినఅమిరం, రాయలం పంచాయతీల్లో రూ.5కోట్ల దుర్వినియోగం
- అధికారుల విచారణలో వెల్లడైన వాస్తవాలు
- చర్యలు తీసుకోవడంలో పంచాయతీరాజ్ శాఖ జాప్యం



భీమవరం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చేయడానికి నిధుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో గ్రామాల నిధులనే కార్యదర్శి స్వాహా చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. భీమవరం రూరల్ మండలం చినఅమిరం, రాయలం గ్రామ పంచాయతీలో కార్యదర్శి రూ. 5 కోట్ల నిధులు స్వాహా చేసినట్టు విచారణలో నిగ్గు తేలింది. వైసీపీ హయాంలో కార్యదర్శిగా పనిచే సిన కృష్ణంరాజు(కిశోర్ రాజు) నిధులు స్వాహా చేసినట్టు అధికారులు గర్తించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఏడుగురు కార్యదర్శుల బృందం, జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. గడిచిన నాలుగేళ్ళలో ఇంత మొత్తంలో నిధులు దుర్వినియోగమవుతుంటే దానిపై దృష్టి పెట్టకపోవడం పెద్ద మిస్టరీగా మారింది. పాలకవర్గాలు లేకపోవడంతో కార్యదర్శి దందా సునాయాసమైంది. అప్పటి స్థానిక ఎమ్మెల్యేతో పాటు రాయలసీమకు చెందిన వైసీపీ మంత్రి అండదండలు ఉన్నాయన్న ఉద్దేశంతో కార్యదర్శి చెలరేగిపోయారు. ఆస్తిపన్నును దారిమళ్లించారు. భీమవరం పట్టణంలో విలీన గ్రామాల్లో ఈ రెండు గ్రామాలు ఉండిపోవడం వల్ల పంచాయతీ పాలకవర్గాలు లేకుండాపోయాయి. దీంతో గడిచిన ఐదేళ్ళ నుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే రెండు గ్రామాలు మగ్గుతున్నాయి. ప్రత్యేకాధికారులుగా ఎంపీడీవోలు, ఇతర అధికారులు వ్యవహరించారు. అయినప్పటికీ నిధులు దుర్వినియోగం కావడంపై విస్మయం వ్యక్తమవుతోంది. రాయలం గ్రామంలో అధికారుల పరిశీలన నివేదికలో రూ. 2 కోట్ల 33 లక్షలు, చినఅమిరంలో రూ. 2. కోట్ల 73 లక్షలు నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. రాయలం గ్రామం నిధుల దుర్వినియోగం నిర్ధారణ సమయంలోనే కార్యదర్శి కృష్ణంరాజును అరెస్ట్ చెయ్యాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇప్పుడు మళ్ళీ చినఅమిరం పంచాయతీ నిధులు దుర్వినియోగంలో కూడా కలెక్టర్ నుంచి అరెస్ట్‌పై ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలోనే దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపారు. పంచాయతీరాజ్ శాఖకు లేఖ రాశారు. కృష్ణంరాజు(కిశోర్‌రాజు)పై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు పంచాయతీ రాజ్ శాఖనుంచి ఎటువంటి స్పందన లేదు. మరోవైపు కార్యదర్శి కృష్ణంరాజు కూడా జిల్లా అధికారుల వద్ద ధీమాను ప్రదర్శిస్తున్నట్టు అంతా కోడై కూస్తున్నారు. దానివల్లే ఇప్పుడు ఆయనపై చర్యలు తీసుకోవడం లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చర్యలు తీసుకోవడంలోనూ, రికవరీలోనూ జాప్యం జరిగితే పంచాయతీరాజ్ శాఖలో నిధులు దుర్వినియోగానికి ఊతమిచ్చినట్టు అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలో ఆచంటలో డయాలసిస్ కేంద్రం

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



ఆచంట వేమవరంలో హాస్టల్స్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పితాని

ఆచంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆచంటలో త్వరలో రూ. కోటి రూపాయల వ్యయంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. గురువారం ఆచంట వేమవరంలో రూ. 3 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పితాని కలిసి ప్రారంభించారు. కేంద్రమంత్రి విలేకరులతో మట్లాడుతూ ఆరు నెలల వ్యవధిలో కేంద్రం రాష్ట్రానికి 3 లక్షల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఆర్డీవో దాసిరాజు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యాకుమారి, సర్పంచ్ జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.

బరి తెగించి డబ్బు పంపకాలు



కోడి పందేల్లో లక్షలు దాటిన ముడుపులు.. సెల్యూట్ బాస్‌లకు ఆనందమయ 'సంక్రాంతి'

భీమవరం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, జూదాలకు అనుమతులు ఇస్తారా లేదా అని ఆతృతగా ఎదురు చూసేవారు. కనీసం పండుగ రెండు రోజులైనా అనుమతులు ఇస్తే సరిపోతుందిలే అనుకునేవారు. అలా పండుగ రోజు వరకు వేచి చూసి పందేలకు తెరలేపేవారు. ఐదేళ్ల ఉన్న వైసీపీ ప్రభుత్వంలో కూడా పందేలు అలానే సాగాయి. కానీ సీన్ రివర్స్ అయ్యింది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి సంక్రాంతి పండుగకు కోడిపందేలు, జూదాలకు హద్దే లేకుండాపోయింది. ఇంకా పండుగ వారం రోజులు ముందుగానే బరుల కోసం స్థలాల కేటాయింపులు భారీగా సెట్టింగులతో చాలా ప్రాంతాల్లో వెలిశాయి. గతంలో సంక్రాంతి ముందు రోజు వరకు కూడా పోలీసులు బరులను ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్లతో ధ్వంసం చేసేవారు. ఈ ఏడాది చాలాచోట్ల పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దానికి తోడు లక్షల్లో ముడుపులు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అధికారులకు అందాయన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతున్నది. గతంలో బెదిరిస్తే ఎంతో కొంత డబ్బులు ఇచ్చేవారు. ఈ ఏడాది అటువంటిది ఏమీ లేకుండానే కట్టలు వచ్చిపడ్డాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో బరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏకంగా రూ.15 లక్షల నుంచి 20 లక్షల వరకు కొంతమంది పోలీసులకు అందాయని చెబుతున్నారు. జిల్లాలోని ఒక స్టేషన్ పరిధిలో క్యాసినో వంటి జూదం నిర్వహించినందుకు ఆ స్టేషన్ అధికారికి రూ.8 లక్షల వరకు ముట్టచెప్పారని, కొన్ని స్టేషన్‌లకు 2 నుంచి 5 లక్షల వరకు అందాయని చెప్పుకుంటున్నారు. ఒక స్టేషన్ పరిధిలో సిబ్బందికి రూ.20 వేల నుంచి 25 వేలు వరకు ముడుపులు అందాయన్న ప్రచారం జరుగుతున్నది. డబ్బులు సరిగా అందని అధికారులు ఒత్తిడి తెస్తే అవతలి వారు ప్రజాప్రతినిధులకు, నాయకులకు విషయాన్ని చెప్పి నీసంగతి చూస్తామంటూ చెప్పడంతో వారు వెనుతిరిగారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ ఏడాది కోడిపందేల బరులు పందెంరాయుళ్ళకు ఆదాయం ఎలా ఉన్నా సంబంధిత అధికారులకు భారీగా జేబులు నిండాయన్న ప్రచారం జరుగుతున్నది.

పోలీసులకు సంబంధం లేదు
డీఎస్పీ జయసూర్య

ఇటీవల సంక్రాంతి నేపథ్యంలో కొన్ని చోట్ల జరిగిన కోడి పందేలు, జూదాల విషయంలో పోలీసులకు ఎటువంటి సంబంధం లేదని భీమవరం డీఎస్పీ జయసూర్య వెల్లడించారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కొన్నిచోట్ల పోలీసులకు ముడుపులు అందాయని జరుగుతున్న ప్రచారం అవాస్తమని అన్నారు. పందేలు, జూదాలు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో జరిగాయన్న విషయం అందరికీ తెలిసిందేనని ఆయన అన్నారు. పోలీసులు ఎక్కడైనా ముడుపులు తీసుకున్నారన్న విషయాలు రుజువైతే ఖచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో
యువకుడి మృతి





మృతి చెందిన క్రాంతికుమార్

పెదపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం కడిమికుంట గ్రామానికి చెందిన నక్కా క్రాంతికుమార్ (19) కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లోని అయోధ్య లాడ్జి సమీపంలో జాతీయరహదారిపై లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి బాబురావు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోటారుసైకిల్‌పై స్నేహితుడు సుధీర్‌తో కలిసి సెల్‌ఫోను మరమ్మతు నిమిత్తం హనుమాన్‌జంక్షన్ వచ్చారు. అనంతరం సెల్‌ఫోన్ షాపు నుంచి మోటారు సైకిల్‌పై తిరిగి వెళుతుండగా విజయవాడ నుంచి జంక్షన్ వైపు వెళుతున్న ఆర్‌జే 11 జీబీ 7744 నెంబరు గల లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో క్రాంతి కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ

జంగారెడ్డిగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం ఫిబ్రవరిలో విద్యార్థినుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఆ ఉపాధ్యాయుడిని అధికారులు సస్పెండ్ చేశారు. ఆ కేసుకు సంబంధించిన విచారణ నిమిత్తం డీవైఈవో మడకం రామన్నదొర గురువారం విద్యార్థులను విచారించారు. విచారణ రిపోర్టును ఉన్నతాధికారులకు సమర్పిస్తానని ఆయన తెలిపారు

బెండ్లపాలెం వాసులకు ఊరట

కాల్వపై బల్లకట్టు ఏర్పాటు .. ఎమ్మెల్యే బొలిశెట్టికి కాలనీ వాసుల కృతజ్ఞతలు



నూతనంగా తయారు చేయించిన బల్లకట్టుపై ఎమ్మెల్యే బొలిశెట్టి, తదితరులు

పెంటపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రావిపాడు సమీపంలో ఉన్న బెండ్లపాలెం వాసులకు ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల స్థలాలు ఇళ్లులేని వారికి ఇక్కడే కేటాయించారు. వారికి కనీసం కాలనీలోకి వెళ్ళేందుకు సరైన మార్గం కూడా ఏర్పాటు చేయలేదు. అక్కడితో తమ పని అయిపోయిందంటూ చేతులు దులిపేసుకున్నారు. స్థలాలు రావంతో చాలా మంది ఇళ్ల కట్టుకున్నారు వీరికి గ్రామంలోకి వెళ్ళేందుకు సరైన మార్గం ఉండేది కాదు. జాతీయ రహదారి నుంచి చుట్టుతిరిగి వెళ్ళాల్సి ఉంటుంది. ఎందుకంటే బెండ్లపాలెం నుంచి రావిపాడు గ్రామాల మధ్య వెంకయ్య ఒయ్యేరు కాలువ ఉంది. ఈ కాలువపై వంతెన లేదు. దీంతో ఆ కాలనీ వాసులు ఇప్పటి వరకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఎన్నికల సమయంలో ప్రచార కార్యక్రమంలో వీరి కష్టం చూసి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వంతెన ఏర్పాటు చేసేంత వరకు తాత్కాలికంగా బల్లకట్టు ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధులు రూ.12 లక్షలతో బల్లకట్టు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్ర- తెలంగాణ మధ్య నిలిచిన ట్రాఫిక్



జీలుగుమిల్లి- అశ్వారావుపేట మధ్య గురువారం నిలిచిన ట్రాఫిక్

జీలుగుమిల్లి, జనవరి 23 : (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి- అశ్వారావుపేట గ్రామ సరిహద్దు వరకు జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. గురువారం సాయంత్రం నుంచి తాటియాకులగూడెం వద్ద జాతీయ రహదారిపై గోతుల్లో లారీ పాడై నిలిచిపోయింది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. సాయంత్రం 5 గంటల నుంచి 8గంటల వరకు వాహన చోదకులు మూడుకిలో మీటర్ల మేర ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. జీలుగుమిల్లి ఎస్సై వి.నవీన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ సిబ్బంది కలసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నారు.

'గాంధేయం' కవితా రచనల పోటీ విజేతలు వీరే

ఏలూరు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాస్థాయిలో 'గాంధేయం' అంశంపై జిల్లా సర్వోదయమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా రచనల పోటీ విజేతల జాబితాను సర్వోదయమండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం పత్రిక లకు విడుదల చేశారు. ఉత్తమమైన 20 రచనలను ఎంపిక చేశామని, విజేతలకు ఈ నెల 30న బహుమతులు, కవితా పురస్కారాలు అందజేస్తామని వివరించారు. విజేతల వివ రాలు ఇలా...కలిగొట్ల గోపాలశర్మ, భీమవరం. తెన్నేటి మాస్టారు, పాలకోడేరు. వేమూరి శ్రీనివాస్, టి.పి.గూడెం. మీసాల సూర్యనారాయణ, పెద అమిరం. దేవరకొండ బాలసుబ్రహ్మణ్యం, ఉండి. కాళ్ళకూరి సుబ్రహ్మణ్యశర్మ, గునుపూడి. యండవల్లి పాండురంగాచార్యులు, గణపవరం. శశికళ, అజ్జమూరు. గుండాల గీతా మహాలక్ష్మి, వబలపర్రు, చివటం సుబ్బారావు, పెనుగొండ. కొల్లాబత్తుల సూర్యకుమార్, పాలకొల్లు. ఏ.వి.వి. మురళీధర్, ఏలూరు, పంపన సాయిబాబు, వీరవాసరం. దొంతాభక్తుని రామ నాగేశ్వరరావు, జి.హనీ, భీమవరం. హైమావ తీసత్య, వేల్పూరు. సాతివల్లి వెంకటేశ్వరరావు, తణుకు. చింతా రాంబాబు, కాట్రేనికోన. ఉజ్జిన కనకదుర్గ, టి.పి.గూడెం. చర్ల మృదులకుమారి, మల్లవరం.

సమస్యలు పరిష్కరించాలని టిప్పర్, లారీ వర్కర్స్ ఆందోళన



భీమవరం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించిందని, అయితే ఇసుక విక్రయించే ప్రాంతంలో స్థానిక టిప్పర్లకు ఒక రేటు, స్థానికేతర టిప్పర్లకు మరో రేటుతో వ్యత్యాసం చూపిస్తున్నారని దానివల్ల తీవ్రంగా నష్టపోతున్నామని టిప్పర్,లారీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రావూరి రాజా ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా టిప్పర్ లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని గురువారం సాయంత్రం నిరశన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు కూడా అక్కడి నాయకులతో కుమ్మక్కై తమను ఇబ్బందులు పాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, జిల్లా ఉన్నతాధికారులకు తెలపటం కోసం ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని అన్నారు. భీమవరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు అడబాల శ్రీనివాస్, అధ్యక్షుడు శిరిగినీడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విర్డ్ ఆసుపత్రిలో హ్యాండ్‌సర్జన్ సేవలు

ద్వారకాతిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఈనెల 24, 25 తేదీల్లో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డా. భాస్కర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, అన్నిరకాల చేతి సమస్యలు ఉన్నవారు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో నిర్దేశించిన వైద్యసేవలను ఉచితంగా అందిస్తామన్నారు. అవసరమైన వారు ముందుగా 8374445108, 7901695176 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రైమ్ కార్నర్

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

నరసాపురం రూరల్,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో గురువారం దమ్ముట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ పొతుమూడి వెంకటేశ్వరావు (51) మృతి చెందాడు. మృతుడు స్వగ్రామం పాలకొల్లు మండలం వెలివెల. భార్యఇద్దరు పిల్లలు ఉన్నారు. చేనులో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడటంతో సంఘటనా స్థలంలోనే వెంకటేశ్వరావు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట సురేశ్ చెప్పారు.

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు వాహనాల్లో కుళ్లిన చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, వీరమ్మకుంట, తోటగూడెం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి చికెన్ వ్యర్థాలతో కూడిన మూడు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీశ్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మూడు వాహనాల్లోని సుమారు 30 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా ఎస్సై చెప్పారు. వాహన యజమానులు, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనాన్స్ కంపెనీ ఎదుట యువకుడి ఆత్మహత్యా యత్నం

భీమవరం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం రెండవ పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో ఉన్న ఒక మోటార్ సైకిల్ ఫైనాన్స్ కంపెనీ ముందు ఒక వ్యక్తి పెట్రోల్ పోసుకుని బుధవారం సాయంత్రం ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన ఒక యువకుడు కొంత కాలం క్రితం అక్కడ బైక్‌ను ఫైనాన్స్‌లో తీసుకున్నాడు. దాని నిమిత్తం రూ. 18 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే వడ్డీల మీద వడ్డీలు పడటంతో సుమారు రూ. 60 వేలు వరకు చెల్లించినట్లుగా బాధితుడు వాపోయాడు. అయినా కూడా ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు ఇంకా సొమ్ములు చెల్లించాలని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అక్కడ ఉన్న స్థానికులు సముదాయించి అతనిని ఇంటికి చేర్చారు. అయితే దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఉద్యోగి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) యశ్వంత్‌దీపు (ఫైల్)

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కలెక్టరేట్ ఆవరణలోని వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వేమవరపు యశ్వంత్‌దీపు (30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు ఇజ్రాయిల్‌పేటకు చెందిన యశ్వంత్ దీపు తండ్రి మరణంతో కారుణ్య నియామకంలో భాగంగా నాలుగు సంవత్సరాల క్రితం అతనికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. అతనికి వివాహం కాగా భార్యభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలతో విడిపోయారు. మళ్ళీ వేరే యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇంకా సంతానం కలుగలేదు. కొంతకాలం నుంచి అనారోగ్యానికి గురై మందులు వాడుతున్నాడు. ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం తనకు అనారోగ్యంగా ఉందని పర్మిషన్ కావాలంటూ ఆశాఖ ఉద్యోగిని అడిగి ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని ఒక ఆసుపత్రికి వెళ్ళారు. సాయంత్రం తిరిగి ఇంటికి చేరలేదు. గురువారం ఉదయానికి ఏలూరు పాతబస్టాండ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని ముక్కు, నోటి వెంబడి రక్తం బాగా వచ్చి రక్తపు మడుగు ఉంది. అతని శరీరంపై ఎలాంటి దెబ్బలు కనిపించలేదు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఏలూరు పాత బస్టాండ్‌లో మృతదేహం

ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి ఆత్మహత్య

లింగపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మాజీగూడెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన కొనకళ్ల శ్రీనివాసరావు(38) లింగపాలెం మండలం కొణిజర్లలోని సంక్రాంతి పండుగకు తన అత్తవారి ఇంటికి వచ్చాడు. ఈ నెల 21వ తేదీన భార్య లక్ష్మితో బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లి పురుగుమందు తాగి అపస్మారకస్థితికి చేరడంతో స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారమందించారు. వెంటనే చింతలపూడిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసు దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

ట్రావెల్ బస్సు ఇంజన్‌లో మంటలు, పొగలు



బస్సు ఇంజన్ నుంచి వస్తున్న పొగలు

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సు వెళ్తుండగా ఇంజన్ నుంచి అకస్మాత్తుగా పొగలు రావడంతో రోడ్డుపై వెళ్ళేవారు గుర్తించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. మార్నింగ్‌స్టార్ ప్రైవేటు ట్రావెల్ బస్సు రాజమండ్రి నుంచి బెంగళూరుకు స్లీపర్ కోచ్‌గా గురువారం రాత్రి వెళుతున్నది. మార్గమధ్యలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద కొంత మంది ప్రయాణికులు ఎక్కారు. మొత్తం పది మంది ప్రయాణికులు మాత్రమే ఆ బస్సులో ఉన్నారు. ఏలూరు ఊరులో నుంచి వెళ్తుండగా రాత్రి 7.55 గంటలకు పాతబస్టాండ్ సిగ్నల్ వద్ద ఆ బస్సు వెనుక ఉన్న ఇంజన్‌లో నుంచి పొగలు వచ్చాయి. ద్విచక్ర వాహనదారులు గుర్తించి వెంటనే వాహనదారులు ఆ బస్సు ముందుకు వెళ్ళి బస్సును ఆపించారు. ఆ బస్సులో ఉన్న పది మంది ప్రయాణికులు వెంటనే కిందకు దిగారు. పొగలు, కొద్దిపాటి మంటలు ఇంజన్ నుంచి వస్తూనే ఉన్నాయి. ఫైర్ ఇంజన్ అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ వల్లే ఈ మంటలు, పొగలు వచ్చి ఉంటాయని గుర్తించారు. ఆ బస్సుకు అప్పటికప్పుడే తాత్కాలిక మరామత్తులు నిర్వహించి ఖాళీ బస్సును తీసుకువెళ్ళారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగపాలెం మండలం వెస్ట్‌ఎడవల్లి గ్రామానికి చెందిన జి.కృష్ణ (45)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కారణంగా ఈనెల 22వ తేదీన పురుగుమందు తాగాడు. అతనిని తొలుత చింతలపూడి ఆసుపత్రికి తీసుకువెళ్ళగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాంపురం స్పోర్ట్స్ క్లబ్‌లో పోలీసుల తనిఖీలు

నరసాపురం రూరల్, జనవరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ క్లబ్‌లో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్పోర్ట్స్ ముసుగులో క్లబ్‌లో పేకాట ఆడుతున్నారని, దీన్ని మూయించి వేయాలంటూ బుధవారం గ్రామస్థులు గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో ఈ క్లబ్‌ను రూరల్ సీఐ ప్రసాద్, మొగల్తూరు ఎస్ఐ వాసు పరిశీలించారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో వారు పరిశీలించి వెళ్ళిపోయారు.



తోట కుటుంబ సభ్యులకు శాశ్వత సభ్యత్వ రసీదు అందిస్తున్న కోళ్ళ నాగేశ్వరరావు

తోట కుటుంబానికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

భీమవరం అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి వారి కుమారుడు తోట జగదీష్ కుమారుడు తోట మౌర్య ముగ్గురుతో పాటు బొంబే స్వీట్స్ పొత్తూరి బాపిరాజు ఒక్కొక్కరూ రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని గురువారం స్వీకరించారు. వారికి పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కోళ్ళ నాగేశ్వరరావు రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా మా కుటుంబ సభ్యులం దరం శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించామని, భవిష్యత్‌లో కుమారుడు జగదీష్, మనుమడు మౌర్య పార్టీ బలోపేతానికి కృషి చేస్తారన్నారు.

టిడ్కో గృహాల రోడ్డుకు వీధి దీపాలు ప్రారంభం



మంత్రి నిమ్మలతో కలిసి కేక్ కట్ చేసి అభినందనలు తెలుపుతున్న మహిళలు

పాలకొల్లు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేదలకు నిర్మించిన టిడ్కో గృహాల కాలనీ ప్రధాన గేటు నుంచి లాకుల వరకు గల రోడ్డులో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ వీధి దీపాలను బుధవారం రాత్రి మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో నివసించే ప్రజల ఆనందమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దీవెనలు అని అన్నారు. మిగిలిన ఇళ్లకు పనులు పూర్తి చేసి మే, జూన్‌లలో అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలకు మహిళలు హారతులు ఇచ్చి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ బి. విజయ సారథి, కూటమి నాయకులు జీవీ, పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కపర్ధి, ధనాని ప్రకాష్, పి.శ్రీనివాసరావు, బీఎస్ శేఖర్, బందెల భాస్కరరావు, జగ్గురోతు రాంబాబు,ఫకీర్‌బాబు, మున్సిపల్ సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

'సమాజ హితాన్ని కోరుకునేదే సాహిత్యం'

భీమవరంటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సమాజ హితాన్ని కోరుకునేదే సాహిత్యమని, సాహిత్యానికి కుల మతాలు లేవని పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో భీమవరంలోని స్థానిక త్యాగరాజ భవనం వద్ద గురువారం నిర్వహించిన 6వ పీఠాధిపతి కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 80 వ వర్ధంతి సభకు ఆలీషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే సాహితీ సేవను ప్రారంభించిన మహనీయుడు కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా అని తెలిపారు. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ద్వారా అందిస్తున్న స్మారక సాహితీ పురస్కారానికి కేంద్రీయ విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మంను ఎంపికచేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ఆచార్య బేతవోలు రూపొందించిన గ్రంథాన్ని ఆలీషా సభలో ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతి ఉమర్ ఆలీషా పురస్కార గ్రహీతకు స్మారక పురస్కారంతోపాటుగా రూ.50,116 నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. సమితి కార్యదర్శి దాయన సురేష్ చంద్రజీ, ఉపాధ్యక్షుడు త్సవటపల్లి మురళీకృష్ణ, కోశాధికారి వడ్లాది శ్రీవెంకటేశ్వరశర్మ, వేగేశ్న సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

హైస్పీడ్ బోటు.. ఉపాధికి వేటు

(ఐదో పేజీ తరువాయి)

రెండు నుంచి మూడు లక్షల వరకు ఖర్చవుతుంది. సంపద పుష్కలంగా దొరికితే రూ.5 లక్షల వరకు మిగులుతుంది. కొన్నిసార్లు పరిస్థితులు అనుకూలించకపోతే వెళ్లిన రెండు రోజులకే వెనక్కి తిరిగి రావాలి. ఇలాంటి సమయంలో ఖర్చులు కూడా రావు. ఈ బోట్లు కాకుండా మరికొంత మంది మత్స్యకారులు ఫైబర్ బోట్లపైన వేట సాగిస్తారు. అయితే వీరు అంతర్వేది లైట్‌హౌస్ పరిధి నుంచి నాలుగైదు కిలోమీటర్ల మాత్రమే లోపలికి వెళ్లి వలల ఆధారంగానే వేట సాగిస్తారు. రెండు, మూడు రోజుల్లో వేట ముగించుకుని వెనక్కి వస్తారు. ఈ బోట్లలో ముగ్గురు నుంచి నలుగురు మత్స్యకారులు ఉంటారు. కొన్నేళ్ల నుంచి ఇవే సముద్రంలో వేట సాగిస్తున్నాయి.

హైస్పీడ్ బోట్లను నిషేధించాలి



తీరంలో మళ్లీ హైస్పీడ్ బోట్లు వేట సాగిస్తున్నాయి. దీని వల్ల చిన్న సోనా బోట్లకు మత్స్యసంపద చిక్కక నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఈ బోట్లు ఇలాగే వేట సాగిస్తే వేటనే నమ్ముకుని జీవిస్తున్న వేలాది మంది మత్స్యకారులు ఉపాధి కరువయ్యే ప్రమాదం ఉంది. తక్షణం ఈ బోట్లను నిషేధించాలి. గతంలో ఆందోళనలు చేయడంతో విశాఖ నుంచి వచ్చే బోట్లు నిలిచిపోయాయి. మళ్లీ ఇప్పుడు కాకినాడ నుంచి నరసాపురం తీరంలో వేట సాగిస్తున్నాయి.

- వనమాడి రాంబాబు, బోటు యజమాని, నరసాపురం

రూ.100 కోట్లు వెనక్కు!

(ఐదో పేజీ తరువాయి)

పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి శాఖలోనూ ఆర్థిక క్రమశిక్షణ అమలు చేస్తున్నారు. బకాయిలు ఒక్కొక్కటిగా చెల్లిస్తున్నారు. శాఖలను గాడిలో పెడుతున్నారు. గత ప్రభుత్వం బకాయిలను ఒక్కొక్కటిగా చెల్లిస్తున్నారు. అయితే స్థానికంగా టెండర్లు పిలవాలంటూ నేతల నుంచి ఒత్తిడి అధికమవుతోంది. జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు పనులపై ఆపసోపాలు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టడంలో బిజీగా ఉన్నారు. కేంద్రం ఇచ్చిన రూ.100 కోట్ల నిధులకు టెండర్లు పిలిస్తే పనులు వేగవంతం అవుతాయని, భీమవరం పట్టణానికి రాకపోకలకు అనువుగా ఉంటుందని నేతలు ఆశిస్తున్నారు. ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇస్తేనే ఇది సాధ్యపడుతుంది.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసే ప్రాంతాలు

భీమవరం రూరల్/తాడేపల్లిగూడెం రూరల్/పాలకొల్లు టౌన్/పాలకొల్లు రూరల్/పెంటపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు చోట్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. భీమవరం రూరల్ రాయలం, బలుసుమూడి, డీఎన్ఆర్ కాలేజ్ రోడ్, బీసీ కాలనీ, లెక్చరర్ వీధి, రామలక్ష్మి నగర్, గొల్లవానితిప్ప రోడ్డు, ప్రకాష్ నగర్, గొర్లమూడి, కొమరాడ, డేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలం పూడి గ్రామాలతో పాటు ఇండస్ట్రియల్, ఆక్వా చెరువుల లైన్లకు సరఫరా ఉండదన్నారు.

• తాడేపల్లిగూడెం మండలం మాధవరం సబ్‌స్టేషన్ పరిధిలోని మాధవరం, జగన్నాధపురం, ఉప్పరగూడెం, తాళ్లపాలెం గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో హౌసింగ్‌బోర్డు కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహనం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

• పాలకొల్లు రూరల్ పూలపల్లి, పందిగుంట, హౌసింగ్ బోర్డు కాలనీలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, పాలకొల్లు పట్టణంలోని టౌన్ హాస్పటల్ ప్రాంతం, బంగారు వారి చెరువుగట్టు, కొడిగట్టు, నాగరాజు పేట, బ్రాడీపేటలోని 1, 2, 3, 5 వీధులు, రామచంద్రకాలనీ, ఆదిత్య కాలనీలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు,

• పెంటపాడు మండలం పెంటపాడు, ఆకుతీగపాడు, ముదునూరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఐదు మండలాల్లో రెండు రోజుల పాటు..

నరసాపురం : ఉండి సబ్‌స్టేషన్ లైన్‌లో మరమ్మతుల నిమిత్తం నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి మండలాల్లో శుక్రవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య అవసరాలను బట్టి సరఫరాను కట్ చేస్తామన్నారు.



పిప్పర టీడీపీ కార్యాలయంలో గన్నికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు



తాడేపల్లిగూడెం టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న వలవల బాబ్జి



తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

భీమవరం అర్బన్/భీమవరం టౌన్/వీరవాసరం (భీమవరం టౌన్)/ జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకను భీమవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామ లక్ష్మి కేక్ కట్ చేసిన అనంతరం లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కోళ్ళ నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ దావోస్‌లో పర్యటిస్తున్న లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాయలంలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో తెలుగు యువత నాయకులు రక్తదానం చేశారు. భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు యిందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, వీరవాసరం, భీమవరం మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, యిందుకూరి రామలింగరాజు, ఉప్పులూరి చంద్రశేఖర్, చెల్లబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కేఎస్ఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని అన్న క్యాంటీన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు భోజనాలు, దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవితో కలిసి సంయుక్తంగా కేక్ కట్ చేశారు. పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, చెల్లబోయిన సుబ్బారావు, టీడీపీ పండు, నల్లం చిట్టిబాబు, వినోద్ వర్మ, విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు. రవాసరం మండల టీడీపీ ఆధ్వర్యంలో నవుడూరుజంక్షన్‌లోని నందమూరి తారాక రామారావు విగ్రహం వద్ద ఎంపీపీ వీరవల్లి దుర్గాభవానీ కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపారు. వీరవల్లి చంద్రశేఖర్, కొల్లేపరశ్రీను, మన్నె శ్రీనివాస్, గోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

• నరసాపురం టౌన్ : నరసాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి జై లోకేశ్ అంటూ నినాదాలు చేశారు. జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, కొల్లుపెద్దిరాజు, పాలూరి బాబ్జీ, ఆదికారి ఆనంతరామారావు, గుబ్బల నాగరాజు పాల్గొన్నారు. రాయపేటలోని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కార్యాలయంలో భారీ కేక్‌ను పార్టీనాయకులు గన్నవరపు శ్రీను, అంద్రాజు రామన్న, రెడ్డిం శ్రీను, ఆడిదల దానియేలు తదితరులు కట్ చేశారు.

• ఆకివీడు/కాళ్ల/ఉండి/పాలకోడేరు : ఆకివీడు టీడీపీ కార్యాలయంలో పటాసులు కాల్చి, కేక్ కట్ చేసి, పదో తంగగతి విద్యార్థినులకు పుస్తకాలు, జామెంటరీ బాక్సులను టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు ఆధ్వర్యంలో అందజేశారు. మండల-పట్టణ ప్రధాన కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, అజ్మల్, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, కౌన్సిలర్ బొల్లా వీరశ్వేత, ఆరిఫ్, సాంబ తదితరులు ఉన్నారు. కాళ్ల మండలంలో మండల అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, కాళ్ల గ్రామ అధ్యక్షుడు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు పుప్పాల బుజ్జి, మొగళ్ల మాధవరావు, కొప్పినీడి గణపతి, వీరమల్లు సురేష్, గనిశెట్టి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. ఉండి మండలం ఉండి టీడీపీ కార్యాలయంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి అధ్యక్షతన కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు తదితరులు లోకేశ్‌కు అభినందనలు అందించారు. డీసీ వైస్‌చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, మాజీ జడ్పీటీసీ కాగిత మహంకాళి, కరిమెరక శ్రీను, కర్రి శ్రీను, పోలుబోతు రాము, తదితరులు పాల్గొన్నారు. కలిగొట్లలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రుద్రరాజు యువరాజు, యశోదకృష్ణ తదితరులు కేక్ కట్ చేశారు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో టీడీపీ నాయకుడు సందీప్ వర్మ ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. వెంకటేష్, అప్పారావు, ప్రభాకరరావు, బాస్కరరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

• పెనుగొండ : పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, రోగులకు, పండ్లు, బిస్కెట్‌లను టీడీపీ పెనుగొండ పట్టణ యువత ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండా ప్రసాద్, బైరిశెట్టి నవీన్, కట్టా గణేష్, రామోజు కిషోర్, పచ్చిగోళ్ల నితిన్‌బాబి, యానాపు సత్తిబాబు, బంగారు బాలాజీ, చలుమూరి శేఖర్, ఉద్దగిరి దత్తు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో సర్పంచ్ నక్కా శ్యామల సోని శాస్త్రి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, రొక్కాల సురేష్, కౌరు శ్రీను, వేండ్ర మురళి, చింతలపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

• తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం టీడీపీ కార్యాలయం వద్ద గూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి బాబ్జి ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, గంధం సతీష్, బండి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు భవిత విద్యావనరుల కేంద్రం వద్ద టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. పట్టణంలో ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. బొలిశెట్టి రాజేష్, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, పైబోయిన వెంకట్రామయ్య, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• అత్తిలి : అత్తిలి తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు, కార్యదర్శి ఆల్తి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పోలిశెట్టి చంటి, కేతా సత్యనారాయణ, బోడపాటి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అత్తిలి మండలం మంచిలి గ్రామంలో గ్రామ నాయకుడు సిరగాని నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో మానవత సంస్థకు రూ.లక్ష, అయ్యప్ప స్వామి గుడి అభివృద్ధికి రూ.రెండు లక్షలు, పెద్దింట్లమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.రెండు లక్షలు, 35 మందికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, రూ.2,500 చొప్పున నగదును అందించడం అభినందనీయమని అన్నారు.

• గణపవరం : గణపవరం మండలం పిప్పరలోని మండల టీడీపీ కార్యాలయంలో లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 120మంది రక్తదానం చేసిన దాతలకు వారు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి కృష్ణంరాజు, ఉంగుటూరు తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, యాళ్ల సుబ్బారావు, కూనసాని నాగేశ్వరరావు, దండు బాబ్జీరాజు, తదితరులు పాల్గొన్నారు.



ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

• పాలకొల్లు టౌన్ :పాలకొల్లు పట్టణంలో మంత్రి నిమ్మల రామానాయుడు తన తండ్రిపేరుతో ఏర్పాటు చేసిన ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బట్టల వర్తక సంఘం భవనంలో రక్తదాన శిబిరం, పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, దుప్పట్లు అందజేశారు.



నవుదూరు జంక్షన్‌లో కేక్ కట్ చేస్తున్న వీరవాసరం మండల టీడీపీ నాయకులు



నరసాపురంలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న పొత్తూరి రామరాజు, తదితరులు



ఆకివీడులో కేక్ కట్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ మండల-పట్టణ అధ్యక్షులు ప్రసాద్, వెంకట్రావు

పెంటపాడులో దూడల అందాల పోటీలు

పెంటపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ అనిల్‌కుమార్ అన్నారు. పెంటపాడులో గురువారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం దూడల అందాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. శిబిరంలో పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ తెలిపారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, ఎంపీటీసీ రెడ్డిసూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బొండాడ పంట కాల్వలో తూడు తొలగింపు

కాళ్ల జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సుమారు పది గ్రామాలకు సాగు, తాగునీరు అందించే బొండాడ పంట కాల్వలో తూడు, చెత్త తొలగింపు పనులను చేపట్టామని ఉండి వాటర్ డీసీ చైర్మన్ తోట ఫణిబాబు తెలిపారు. తూడు తొలగింపు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. శివారు గ్రామాల వారికి సాగు, తాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే కనుమూరు రఘు రామృష్ణంరాజు ఆదేశాల మేరకు పనులు చేపట్టామన్నారు. బొండాడ నీటి సంఘం అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండారు మాధవ్‌కు జానకీరామ్ పరామర్శ

నరసాపురం రూరల్, జనవరి23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పితృ వియోగం కలిగిన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడిని గురువారం మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్ పరామర్శించారు. తండ్రి ప్రతాప్‌నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'పీఎం సూర్య ఘర్'ను వినియోగించాలి

మొగల్తూరు, జనవరి 23. (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ ఓంకారం సూచించారు. గురువారం మొగల్తూరులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాయితీతో నివాసాలపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఈ పథకానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు అందిస్తాయన్నారు. డీఈ మధుకుమార్, ఏఈ ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌వోలుగా ఇద్దరు ఎంపిక

భీమవరంటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవం ఈనెల 25వ తేదీ పురస్కరించుకుని అందించే అవార్డులలో భాగంగా జిల్లానుంచి ఇద్దరు బీఎల్‌వోలను ఉత్తమ బీఎల్‌వోలుగా ఎపింక చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తణుకు అసెంబ్లీ నియోజకవర్గంలోని పీఎస్ నంబరు 100 బీఎల్‌వో జె.శరవన్ కుమార్‌ను, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పీఎస్ నంబరు 245 బీఎల్‌వో ఎస్.భవానీని ఎంపిక చేశారు. వీరికి 25న అవార్డులను అందించనున్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



ఆకివీడులో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణుల నివాళి

ఆకివీడు/పాలకొల్లు అర్బన్/ఆకివీడు రూరల్ / తాడేపల్లిగూడెం అర్బన్/గణపవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆకివీడు మాదివాడ శాఖ గ్రంథాలయం వద్ద వున్న విగ్రహానికి టీడీపీ శ్రేణులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు అందజేశారు. మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, తదితరులు ఉన్నారు. పాలకొల్లు జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ పాఠశాల హెచ్ఎం ఆర్.భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో వీవర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి సెల్యూట్ చేసి నివాళులర్పించారు. ఆకివీడు మండలం దుంపగడప వీవీ గిరి కళాశాలలో, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం వద్ద నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపవరంలో స్థానిక వివేకనంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు ఆధ్వర్యంలో వివేకనంద సేవా సమితి కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెరుగులంక భూములు పేదలకు పంచాలి

పెనుగొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం గోదావరి మధ్య లంక వెంబడి వున్న సుమారు 200 ఎకరాలు పేదలకు పంచాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం సీపీఎం జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో బృందం గోదావరి పరివాహక ప్రాంతంలోని లంకభూములలో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కె.గోపాలన్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా పెరుగులంక భూములను పంచాలని డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం పట్టించుకున్న సందర్భం లేదన్నారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా నుంచి పల్లె పాలెంకు చెందిన కొందరు రైతులు సుమారు 50 ఎకరాలు లంక భూమి ఆక్రమించుకుని సాగు చేస్తుందన్నారు. ఇప్పటికే సుమారు 400 ఎకరాలు పట్టా సాగుదారులు ఉంటున్న భూముల వెంబడి ఉన్న 200 ఎకరాలను పేదలకు పంచి ఉపాధి కల్పించాలన్నారు. ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, కె.రత్నరాజు, ఎ.శ్రీనివాసరావు, జి.భాను పాల్గొన్నారు.

విజయరామరాజు సేవలు చిరస్మరణీయం



సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

తణుకు రూరల్, జనవరి 23, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతు నాయకునిగా భూపతిరాజు విజయరామరాజు సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు అన్నారు. గురువారం తేతలి గ్రామంలో నిర్వహించిన విజయరామరాజు సంతాప సభలో ఆయన మాట్లాడారు. తేతలి సర్పంచ్‌గా సుమారు తొమ్మిదేళ్ల పాటు పని చేశారని, పంచాయతీ భవనానికి స్థలాన్ని విరాళంగా అందజేశారన్నారు. కనుమూరి సత్యనారాయణరాజు, పి.రామరాజు, చింతలపాటి రామకృష్ణంరాజు, రాఘవులు, రాచూరి రెడ్డి, కొండ్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు.

ఇ ంటర్వ్యూ..

భవన నిర్మాణ కార్మికులు బీమా వినియోగించుకోవాలి



కె. భాస్కర రామాంజేయ శర్మ
అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, పాలకొల్లు

• మీ పరిధిలోని ఉండే ఏరియాలేవి ?

జవాబు : పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, ఆచంట, పోడూరు, ఆచంట, యలమంచిలి మండలాలు ఉన్నాయి.

• కార్మికులకు మీశాఖ అందించే సాయం ?

జవాబు: ప్రభుత్వం అందిస్తున్న బీమా సౌకర్యం భవన నిర్మాణ కార్మికులందరికి వర్తిస్తుంది.

• ఎంత మందికి బీమా సౌకర్యం కల్పించారు ?

జవాబు: సుమారు 75 వేల మంది వరకు ఉన్నారు. ఇప్పటివరకు 64 వేల మంది బీమా పథకంలో చేరారు.

• బీమా పథకంలో చేరడానికి మార్గదర్శకాలు ?

జవాబు: రూ.110 చెల్లించాలి.. ఐదేళ్ల వర్తిస్తుంది

• పథకంలో చేరితే కలిగే ప్రయోజనాలు ?

జవాబు: కార్మికులు ప్రమాదవ శాత్తు ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి రూ.5లక్షలు బీమా, సహజ మరణమైతే రూ. 80వేలు వస్తుంది.

(ఆంధ్రజ్యోతి-పాలకొల్లు అర్బన్)

మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

ఆకివీడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ శ్రేణులు మొక్కు తీర్చుకున్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి, చంద్రబాబునాయుడు సీఎం అవ్వాలని, కనుమూరి రఘురామకృష్ణరాజు మెజార్టీతో విజయం సాధించాలని మొక్కుకున్నారు. గురువారం స్థానిక మినీ బైపాస్ రోడ్‌లోని సాయిబాబా దేవాలయం నుంచి కాలినడకన కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్ళి స్వామిని దర్శించుకున్నారు. కౌన్సిలర్లు కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, పార్టీ సీనియర్ నేతలు ఇళ్లాపు కృష్ణవేణి, బాలరాజు, కిమిడి నాగరాజు, మో పిదేవి శ్రీను, రంబ శివ తదితరులు ఉన్నారు.

స్కూలుకు కంప్యూటర్ల బహూకరణ

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం తాడేపల్లిగూడెం ఐడీబీఐ బ్యాంకు ఎనిమిది కంప్యూటర్‌లు బహూకరించినట్టు హెచ్ఎం మైనం సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెం బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, ఏలూరు మేనేజర్ వి.శ్రీశ్రీనివాసరావు గురువారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్‌లు అందించిన ఐడీబీఐ బ్యాంకు వారికి హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో చేరిన రజకులు

ఆచంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆచంటలో రజక సంఘం నాయకులు తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సమక్షంలో చేరారు. గురువారం పోడూరు మండలం కొమ్ముచిక్కాల క్యాంప్ కార్యాలయంలో పితాని సత్యనారాయణ టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకుడు వద్దిపర్తి అంజిబాబు మాట్లాడుతూ బీసీ కుల వృత్తులకు టీడీపీలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకు వస్తుందన్నారు. టీడీపీలో చేరిన వారిలో కొత్తపల్లి నాగేశ్వరరావు, యలమంచిలి అప్పారావు, చల్లపల్లి నరసన్న, చల్లపల్లి వెంకటరావు తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పెంటపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైపీ. లక్ష్మణరావు అన్నారు. గురువారం ఆకుతీగ పాడు, చింతపల్లి, కోరుమిల్లి గ్రామాల్లో కీటకజనిత వ్యాధులపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులకు ఆహ్వానం

ఆకివీడురూరల్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ ప్రతాప్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలల వ్యవధి గల రెండు కోర్సులు డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు, మహిళలకు టైలరింగ్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కోర్సు పూర్తైన తరువాత సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. ఆసక్తి గల వారు 8688594244ను సంప్రదించాలని తెలిపారు.